గడపగడపకూ విజయోత్సవం

- చింతలపూడి నియోజకవర్గంలో 200 రోజులు పూర్తి
- జంగారెడ్డిగూడెంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ
- సీఎం జగన్ పాలనలో ప్రతి ఇంటా సంతోషం
- ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా


జంగారెడ్డిగూడెంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా జంగారెడ్డిగూడెంలో శనివారం భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని అన్నారు. విద్య, వైద్యం, రైతు సంక్షేమం, మహిళాభ్యున్నతి, చిన్నారుల పోషణ ఇలా పుట్టిన నాటి నుంచి గిట్టే వరకు ప్రతి ఒక్కరికి ఏదో విధంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమాన్ని అందిస్తోందన్నారు. దళారుల ప్రసక్తే లేకుండా ప్రభుత్వ పథకాల లబ్ధిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వలంటీర్ సైన్యం ప్రతి గడపకు చేరవేస్తోందన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తాము పర్యటిస్తున్న సమయంలో పథకాలన్నీ అందుతున్నాయని తమ వద్ద ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే ఎలీజా పేర్కొన్నారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రిగా కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. తనకు ఇలాంటి అవకాశం ఇచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే ఎలీజా ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేకు ఘన స్వాగతం

నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 200 రోజులకు చేరుకున్న సందర్భంగా గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసి అనంతరం జంగారెడ్డిగూడెం వరకు మోటార్‌సైకిళ్లు, కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో ఆటో నగర్ సమీపంలో, బస్టాండ్ సెంటర్, బొసుబొమ్మ సెంటర్ వద్ద భారీ గజమాలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. జంగారెడ్డిగూడెం గంగానమ్మ గుడి వద్ద గల వైఎస్సార్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. నాయకులను, కార్యకర్తల నుద్దేశించి రాబోయే ఎన్నికల సమరానికి నేను సిద్ధంగా ఉన్నాను. మీరు సిద్ధమేనా అని పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, మహిళా జిల్లా అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మ, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి, జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్ఞానారెడ్డి, మండలపు సాయిబాబా, నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజాప్రతినిధులు, పట్టణ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చిటికెల అచ్చిరాజు, వామిశెట్టి హరిబాబు, గురజాల పార్థసారధి, చనమాల శ్రీనివాస్, బత్తిన చిన్న, వందనపు వెంకటేశ్వరరావు, తగరం సీతారాంబాబు, పెద్దెత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం 22వ వార్డులో ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ తడికమళ్ల మురళి పాల్గొన్నారు.

కామవరపుకోట: జంగారెడ్డిగూడెంలో ఎమ్మెల్యే ఎలీజా చేపట్టిన బహిరంగ సభకు మండలం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. కామవరపుకోట నుంచి రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పందు జగదీష్ ఆధ్వర్యంలో, తడికలపూడి నుంచి బొట్ల లక్ష్మణ్, వేరు శ్రీను ఆధ్వర్యంలో, రామన్నపాలెం నుంచి రాయంకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా బయలుదేరి జంగారెడ్డిగూడెం వెళ్లారు.

లింగపాలెం: జంగారెడ్డిగూడెంలోని విజయోత్సవ సభకు లింగపాలెం మండలం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీ బైక్ ర్యాలీగా తరలివెళ్లారు. పార్టీ సీనియర్ నాయకుడు బీవీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 1200 బైక్‌లపై ర్యాలీగా జంగారెడ్డిగూడెం తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మండలపు సాయిబాబు, ధర్మాజీగూడెం సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత మునునూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర లిడ్‌క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ శ్రేణులు తరలివెళ్లారు.

నారా లోకేష్‌కు ఎమ్మెల్యే ఎలీజా సవాల్

జంగారెడ్డిగూడెం: నారా లోకేష్ యువగళం పాదయాత్రలో జంగారెడ్డిగూడెంలో ప్రగల్భాలు పలికాడని, తన తండ్రి చంద్రబాబును స్కిల్ స్కాం కేసులో జైల్లో పెడితే ఢిల్లీ పారిపోయాడని ఎమ్మెల్యే ఎలీజా ఎద్దేవా చేశారు. ఇసుక దొంగనని నాపై ఆరోపణలు గుప్పించావు.. ఇక్కడ ఎక్కడ ఇసుక ఉంది లోకేష్.. ఇసుక దొంగలని నీ పక్కనే పెట్టుకుని నాపై ఇసుక దొంగ అని ఆరోపిస్తావా.. నేను ఉద్యోగం చేసిన చోటైనా.. ఇప్పుడు ఎమ్మెల్యేగా చేసిన చోటైనా.. ఎక్కడైనా అవినీతి చేశానని నిరూపిస్తే.. నేను రాజకీయ సన్యాసం చేస్తా.. నిరూపించలేకపోతే నువ్వు చేస్తావా అని ఎమ్మెల్యే ఎలీజా నారా లోకేష్‌కు సవాల్ విసిరారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం గోవింద నామస్మరణతో మార్మోగింది. స్వామి వారికి ప్రీతికరమైన రోజు శనివారం ఉదయం తెల్లవారుజామున సుప్రభాత సేవ మొదలుకుని ఆరాధన, తోమాల సేవ, బాలబోగం నివేదన నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు, అయ్యప్పస్వాములు స్వామివారిని దర్శించుకున్నారు. వారి గోవింద నామస్వరంతో ఆలయం మార్మోగింది. కాగా, చంద్రగ్రహణం నేపథ్యంలో సాయంత్రం 4 గంటల నుంచి ఆలయం మూసివేశారు. ఆదివారం సంప్రోక్షణ, పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనం ఉంటుందని అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు, ఈవో రాంబాబు తెలిపారు.

సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

జంగారెడ్డిగూడెం: సృజనాత్మక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటూ జీవితంలో ముందుకు సాగాలని ఏలూరు జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్, జంగారెడ్డిగూడెం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం లోవకుమారి, కొయ్యలగూడెం మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్ బీవీవీ రావు అన్నారు. జంగారెడ్డిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో శనివారం మెంటల్ హెల్త్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. స్పందన ఇదా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆడపిల్లలు సమస్య ఏదైనా ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకుంటే శారీరిక బలాన్ని సైతం ధైర్యంగా ఎదుర్కొవచ్చన్నారు. ముఖ్యంగా వ్యక్తిగత నైపుణ్యాంశాలను వృద్ధి చేసుకుంటూ లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. జెడ్పీ హైస్కూల్ ఫస్ట్ అసిస్టెంట్ విజయ ప్రకాశ్, సీఎస్‌టీఎస్ డిగ్రీ కళాశాల సన్యాసిరావు, పాఠశాల స్టాఫ్ జాయింట్ సెక్రటరీ సుందరీదేవి విద్యార్థులకు మెంటల్ హెల్త్ ఎంపవరింగ్‌పై మాట్లాడారు. యోగా టీచర్ కిరణ్ కిషోర్ యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతతను ఎలా పెంపొందించుకోవాలో వివరించారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ


జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన బీవీఎస్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు

లింగపాలెం: దేశం గర్వించే నేత బాబూ జగ్జీవన్‌రామ్ అని, ఆయన దళితుల అభ్యున్నతికి దేశ ప్రజలకు చేసిన సేవలు ఎనలేనివని వైఎస్సార్ సీపీ నాయకుడు బీవీఎస్ రెడ్డి అన్నారు. ముడిచెర్లలో శనివారం బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విగ్రహ దాత బీవీఎస్ రెడ్డి మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్‌ను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్ మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని యువత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రావి రమాదేవి కొండయ్య, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు నూతులపాటి శ్రీను, ముళ్లపూడి సుమన్, డోల వెంకటేశ్వరరావు, తాళం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చండీహోమం


జంగారెడ్డిగూడెం నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం నూకాలమ్మ అమ్మవారి దివ్య సన్నిధిలో 56వ చండీ హోమం వైభవంగా నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలతో పాటుగా పౌర్ణమి వరకు అమ్మవారికి విశేష కార్యక్రమాలు నిర్వహిస్తూ ఈ చండీ హోమం అనంతరం మహా పూర్ణాహుతిని సమర్పించారు. శనివారం చంద్రగ్రహణం కావడంతో సాయంత్రం నిర్వహించే హోమాన్ని ఉదయం పూట పూర్తి చేసినట్లు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వీరంపాలెం శ్రీ బాలా త్రిపుర సుందరి పీఠం ప్రతినిధి బ్రహ్మశ్రీ ఈమని శశికుమార్‌శర్మ తెలిపారు. ఆలయ అర్చక స్వాములు నిత్య పూజా కైంకర్యాలు సాయం సంధ్యా హారతి పూజలు, 56వ చండీహోమం నిర్వహించారు. చండీహోమంలో సానికొమ్ము శ్రీనివాసరెడ్డి నర్మద దంపతులు, కోలాటి అఖిల కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక


త్రిషంక్ కోటి

ద్వారకాతిరుమల: రాష్ట్ర స్థాయి చెస్ (చదరంగం) పోటీలకు ద్వారకానగర్‌లోని ఓ పాఠశాల విద్యార్థి ఎంపికయ్యాడు. తాడేపల్లిగూడెంలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో డిపోల్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి కె.త్రిషంక్ కోటి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. దాంతో త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు రాజవరం విద్యార్థులు


రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు రాజవరం హైస్కూల్ నుంచి ఎంపికైన విద్యార్థులు

కొయ్యలగూడెం: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు తమ హైస్కూల్ నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికై నట్లు రాజవరం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం వి.రామారావు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి ఖోఖో పోటీలలో రాజవరం హైస్కూల్ విద్యార్థులు ఎస్.రాజు, ఎస్‌డీ షరీఫ్, కె.దయ సత్య సాయి, ఎ.దేవకీ, వై.తులసి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. ఈ సందర్భంగా వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు జె.శ్రీనివాస్‌ను, విద్యార్థులను అభినందించారు.

ఘనంగా అన్నసమారాధన


గంగానమ్మ ఆలయం వద్ద మహాన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా పట్టణంలోని గంగానమ్మ ఆలయం వద్ద శనివారం మహాన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మితో పాటు పరిమి సత్తిపండు, మండవల్లి విజయసారధి, వందనపు వెంకటేశ్వరరావు, సీహెచ్‌ఆర్.రాజు, సీఐ పి.రాజేష్, జీవన్ తదితరులు పాల్గొని ప్రారంభించారు. సుమారు 15వేల మంది పాల్గొని అన్నప్రసాదాన్ని ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన లడ్డూను వేలం నిర్వహించారు. లలితా సూర్య వారు అందించిన 105 కేజీల లడ్డూను సుమంగళి జ్యూయలర్స్ కంభంపాటి సీతారామమూర్తి రూ.1,06,000కు దక్కించుకోగా, భక్తాంజనేయ స్వీట్స్ వారు తయారు చేసిన 81 కేజీల లడ్డూను వందనపు వెంకటేశ్వరరావు వేలంలో దక్కించుకున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

డెంగీ లక్షణాలతో వ్యక్తి మృతి

టి.నరసాపురం: డెంగీ లక్షణాలతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని బొర్రంపాలెంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బొర్రంపాలెం గ్రామానికి చెందిన గొడుగు వెంకటేశ్వరరావు (56) ఐదు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. స్థానికంగా వైద్యం చేయించినా జ్వరం తగ్గకపోవడంతో కుటుంబసభ్యులు జంగారెడ్డిగూడెం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. జ్వరం తీవ్రత ఎక్కువగా ఉండటంతో వెంకటేశ్వరరావు మృతిచెందాడు. డెంగీ లక్షణాలతో మృతిచెందినట్లు వైద్యులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు నుంచి పొగలు

ద్వారకాతిరుమల: ఏలూరు నుంచి ద్వారకాతిరుమల క్షేత్రానికి వచ్చిన ఒక ఆర్టీసీ బస్సు నుంచి అకస్మాత్తుగా పొగలు రావడంతో ప్రయాణికులు భీతిల్లారు. ఈ ఘటన స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం. ఏలూరు డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు ఉదయం ప్రయాణికులతో ద్వారకాతిరుమల అంబేడ్కర్ సెంటర్‌కు చేరుకుంది. అక్కడ ప్రయాణికులు బస్సు దిగుతున్న సమయంలో ఒక్కసారిగా బస్సు నుంచి దట్టంగా పొగలు వచ్చాయి. దాంతో బస్సులో ఉన్న వారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కొద్ది సేపటికి పొగలు రావడం ఆగడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే బస్సు నిలిచిపోవడంతో ప్రయాణికులంతా దిగి వెళ్లిపోయారు. సాంకేతిక లోపం కారణంగానే బస్సులోంచి పొగలు వచ్చినట్లు తెలుస్తోంది.

తప్పిన పెనుప్రమాదం

బుట్టాయగూడెం: స్థానిక శివాలయం సమీపంలో బస్టాండ్ వైపు జంగారెడ్డిగూడెం ఆర్టీసీ బస్ దూసుకువెళ్లింది. డిపో నుంచి ప్రయాణికులను ఎక్కించుకుని ఆర్టీసీ బస్ దొరమామిడి వైపు వెళ్తుండగా శివాలయం సమీపంలో మలుపు తిప్పుతుండగా అకస్మాత్తుగా అదుపు తప్పి బస్టాండ్ వైపునకు దూసుకువెళ్లింది. ఈ ఘటనలో బస్ అద్దాలు పగిలిపోయాయి. ప్రయాణికులకు, డ్రైవర్‌కు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. సాంకేతిక లోపం కారణంగా బస్ అదుపు తప్పిందని డ్రైవర్ తెలిపారు.

ముగిసిన శ్రీగాయత్రీ లక్ష కుంకుమార్చన


మదన గోపాల స్వామి ఆలయంలో గాయత్రీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీ గాయత్రీ లక్ష కుంకుమార్చన శనివారంతో ముగిసింది. ఆలయ ప్రధాన అర్చకులు గుడిపూడి శేషాచార్యుల ఆధ్వర్యంలో పదిహేను రోజులపాటు కుంకుమార్చన పూజలు నిర్వహించారు. చివరి రోజున పాలకమండలి చైర్మన్ మద్దు గోపి దంపతులచే గాయత్రి హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. ఐదేళ్లపాటు నిర్వహించే గాయత్రి లక్ష కుంకుమార్చనలో భాగంగా ఇప్పటివరకు రెండేళ్లు పూర్తయినట్లు అర్చకులు పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. అదే విధంగా గొలగమూడి వెంకయ్య అవధూత స్వామి ఆలయంలో అన్నసమారాధన పునః ప్రారంభించారు. ప్రతి శనివారం మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం అమలు చేస్తామని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

మారుమూల గ్రామాలకూ సంక్షేమ లబ్ధి

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- గిరిజన గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం


గడ్డపల్లి పంచాయితీలో సంక్షేమ పథకాల బ్రోచర్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

పోలవరం రూరల్: అత్యంత మారుమూల గ్రామాల్లోని కొండ్రెడ్డి గిరిజనులకు నేడు సంక్షేమ పథకాలు ఇళ్ల వద్దకే అందుతున్నాయంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలవే అని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. పోలవరం మండలంలోని అత్యంత మారుమూల గిరిజన గ్రామాలైన పాపికొండల సమీపంలోని అభయారణ్య ప్రాంతంలో గల గడ్డపల్లి పంచాయతీ పరిధిలోని గిన్నెపల్లి, తంగేడుకొండ, దార్వాడ, చిలకలూరు, చీమలూరు గ్రామాల్లో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మారుమూల గ్రామాల్లో గిరిజనులకు ఇళ్ల వద్దకే పింఛన్ అందజేయడంతో పాటు నేరుగా సంక్షేమ పథకాలు కూడా వలంటీర్ వ్యవస్థ ద్వారా అందించడం జరుగుతుందన్నారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అనే విషయాలను తెలుసుకోవడం కోసమే ఈ గ్రామాల్లో పర్యటించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తూ ప్రతి కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందో ఎమ్మెల్యే స్వయంగా లబ్ధిదారులకు తెలియజేశారు. కొన్ని గ్రామాలకు వాహనాలు వెళ్లకపోవడంతో కాలినడకనే ఎమ్మెల్యే పర్యటించి ఆ గ్రామాలకు చేరకుని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. రోడ్డు మార్గం సరిగా లేని ఈ గ్రామాల్లో గతంలో ఎప్పుడూ అధికారులు గాని, ప్రజా ప్రతినిధులు గాని తరచుగా వెళ్లిన సంఘటనలు కూడా పెద్దగా లేవు. దిగువ స్థాయి సిబ్బంది మాత్రం ఆ ప్రాంతాలకు వెళ్లి వస్తుంటారు. ఇటువంటి పరిస్థితుల్లో పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు గట్టి పోలీసు బందోబస్తు మధ్య ఈ గ్రామాలకు చేరుకుని ప్రజల సమస్యలు తెలుసుకుని సానుకూలంగా విన్నారు. ప్రధానంగా చింతపల్లి నుంచి గడ్డపల్లి గ్రామం వరకు ఆరు గ్రామాల ప్రజలు నిత్యం ఏదో ఒక పనిపై కన్నాపురం వరకు రావాల్సి ఉంటుందని, రోడ్డు మార్గం సరిగా లేదని, రోడ్డు నిర్మించాలని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి తన వంతు కృషిచేస్తానన్నారు. ఒకొక్క సచివాలయానికి రూ.40 లక్షల నిధులు కేటాయించడం జరుగుతుందని, ఆ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టవచ్చన్నారు. ఇందుకు సంబంధించి గ్రామస్తుల సహకారంతో చేపట్టే పనులపై ప్రణాళికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే ఎన్నికల్లో కూడా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పోలవరం సీఐ కె.విజయబాబు, ఎస్సై ఎస్ఎస్ పవనకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బెటాలియన్‌తో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, గడ్డపల్లి సర్పంచ్ చుండ్రు శారద, ఎంపీటీసీ మిడియం సింగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పొడుం శ్యామ్, మాదేపల్లి సాయి, కోటం బాబూరావు, మండల పరిషత్ ఏవో సీహెచ్ శ్రీనివాసబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి, ఏపీఎం బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ ఆరోగ్య రక్ష


చింతలపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్డు అందజేస్తున్న దృశ్యం


కొయ్యలగూడెం: చొప్పరామన్నగూడెంలో చిన్నారులకు వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

చింతలపూడి: ప్రతి కుటుంబానికీ ఆరోగ్య రక్ష కల్పించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని నగర పంచాయతీ కమిషనర్ ఎస్ రాంబాబు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని సుబ్బరాజు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లడారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను పేద, మధ్య తరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి వైద్య నిపుణులు శిబిరంలో పాల్గొని కంటి పరీక్షలు జరిపారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు గంధం రామ్మోహన్ రావు(చంటి), ఎంఈఓ -2 కిరణ్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు శౌంరి ఖన్నా, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శనివారం చొప్పరామన్నగూడెం గ్రామంలో శనివారం నిర్వహించారు. ఎంపీడీవో ఆర్.బేబీ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యులు వివిధ చికిత్స విభాగాలలో రోగులకు సేవలు అందించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంబటి సరస్వతి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైఎస్సార్ పోషకాహార స్టాల్‌ని జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీపీ గంజిమాల రామారావు ప్రారంభించారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన ప్రభుత్వం అధికారులను సత్కరించారు. తహసీల్దార్ పాశం నాగలక్ష్మి, ఎంపీడీవో ఆర్.బేబీశ్రీలక్ష్మిల నేతృత్వంలోని వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, విద్యాశాఖ అధికారులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చిరువూరు కళావతి, వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి విష్ణు, మంతెన సోమరాజు, గంటా శ్రీనివాస్, శీమకుర్తి సత్యనారాయణ, కసుకుర్తి వేణు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలకు వెళ్లే రోడ్డుకు మోక్షం

- రూ.87 లక్షలతో రోడ్డు నిర్మాణం
- పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్‌లు


రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి తదితరులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ పక్కనే పలు కళాశాలలకు వెళ్లే రోడ్డు మార్గానికి మోక్షం లభించింది. అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు కారణంగా ఆ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు చాలా ఇబ్బందులు పడేవారు. గత ప్రభుత్వాలు ఈ రోడ్డు అవసరతను గుర్తించినా పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో రోడ్డు అభివృద్ధి లేక, ప్రజలు అవస్థలు పడేవారు. ఈ రోడ్డుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మోక్షం కల్పించింది. ఇంతకు ముందుకు ఉన్న బీటీ రోడ్డు స్థానంలో సీసీ రోడ్డు ఏర్పాటుకు నిర్ణయించింది. మొత్తం 880 మీటర్ల పొడవున ఉన్న ఈరోడ్డును రూ.87 లక్షలతో నిర్మించేందుకు చర్యలు తీసుకోవడంతో రోడ్డు నిర్మాణం ప్రారంభమైంది. ఇప్పటికే సుమారు 600 మీటర్లవకు రోడ్డు నిర్మాణం పూర్తయినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి తెలిపారు. ఈ రోడ్డు వెంబడి మార్జిన్‌లను నింపేందుకు గ్రావెల్‌ను సైతం తరలిస్తున్నామన్నారు. ప్రజావసరాలే ముఖ్యంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. శనివారం రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మితో పాటు వైస్‌చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, కౌన్సిలర్‌లు మానవతా మూర్తి, శంకు సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన చిన్న, చింత అనిల్‌గౌడ్, చిప్పాడ వెంకన్న, కంచర్ల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసపురంలో గ్రామసభ

జంగారెడ్డిగూడెం రూరల్: శ్రీనివాసపురం పంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపుపై గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ యడ్లపల్లి రాధిక, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు మాట్లాడుతు ఉపాధి హామీ పథకం పనులను ఉపాధి కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వార్డు సభ్యులు, ఎన్ఆర్‌జీఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న సచివాలయాల శాఖ ఎస్‌బీసీసీ కోఆర్డినేటర్ స్నేహన్

ద్వారకాతిరుమల: ఆరోగ్య లక్ష్య సాధన కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని సచివాలయాల శాఖ ఎస్‌బీసీసీ కోఆర్డినేటర్ టీఎస్ స్నేహన్ సూచించారు. జంగారెడ్డిగూడెం ఐసీడీఎస్ సీడీపీఓ బ్యూలా రాణి ఆధ్వర్యంలో మండలంలోని జి.కొత్తపల్లి సచివాలయంలో గ్రామస్థాయి టాస్క్ ఫోర్స్ బృంద సభ్యులకు శనివారం ఆయన అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతక ముందు ఆయన గ్రామ సచివాలయాన్ని పరిశీలించి, సిబ్బంది, వలంటీర్లతో సమావేశమయ్యారు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశానుసారం సచివాలయంలో బాలల కోసం ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించక పోవడాన్ని గుర్తించి, వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో స్నేహన్ మాట్లాడుతూ 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో 1-6 సాధన కోసం గ్రామ సామాజిక ఆరోగ్య అధికారి టీం లీడర్‌గా 5 గురు సభ్యులతో ఈ టాస్క్ ఫోర్స్ ఏర్పాటైందన్నారు. ఈ టీం ప్రతి నెలా సమావేశమై గ్రామంలో ప్రజల ఆరోగ్యం గురించి చర్చించుకుని, అందరికీ సంపూర్ణ ఆరోగ్యం లభించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, అలాగే యుక్తవయస్సు బాలల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. యుక్తవయస్సు బాలికలకు క్రమం తప్పకుండా రక్తశాతం తెలుసుకునే పరీక్షలు జరపాలన్నారు. ఇవన్నీ ఆరోగ్య లక్ష్యాల్లో భాగమేనని అన్నారు. వీటిని సక్రమంగా నిర్వహించడానికి అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిస్థితులను మెరుగు పరచడం, అనారోగ్యంతో బాధపడే వారికి వైద్య సేవలు అందించడం వంటివి ఈ కమిటీ చూడాలన్నారు.

వాల్మీకి రామాయణం మానవాళికి మార్గనిర్దేశం


వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్న ఐటీడీఏ పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం: వాల్మీకి రామాయణం మానవాళికి మార్గనిర్దేశమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ అన్నారు. కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద శనివారం వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పీఓ దండలు వేసి నమస్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్రేతాయుగం నాటి రామాయణాన్ని నేడు ప్రతిఒక్కరూ అనుసరించేలా మహర్షి వాల్మీకి రచించారని చెప్పారు. వాల్మీకి రచించిన రామాయణమే మానవ జీవన పారాయణమని అన్నారు. జాతీయ సనాతన ధర్మం విశిష్టతను రామాయణం ద్వారా వాల్మీకి మహర్షి జాతికి తెలియజేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ శ్రీనుకుమార్, వెలుగు ఏపీడీ నాగేశ్వరరావు, డీవైఈఓ నీలయ్య, ఐటీడీఏ మేనేజర్ ప్రకాష్, కేఆర్‌పురం ఐటీడీఏ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: వాల్మీకి జయంతి శనివారం శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. లైబ్రేరియన్ యు.రాముడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వాల్మీకి చిత్రపటానికి చదువుల సంఘం సభ్యులు పూలు వేసి నమస్కరించారు. రామాయణం రచించిన సంస్కృత కవి వాల్మీకి అని రాముడు తెలిపారు. హిందువులకు అత్యంత ముఖ్యమైన ఇతిహాసాలలో ఒకటైన రామాయణాన్ని వాల్మీకి రచించడానికి సంకల్పించిన రోజునే వాల్మీకి జయంతిగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. బోయవాడైన రత్నాకరుడు వాల్మీకిగా ఉద్భవించిన విధానాన్ని వివరించారు.